10 YEAR ANNIVERSARY 2014 - 2024

# పెన్ పవర్

తెలంగాణ రౌండప్

గురువారం | 24 అక్టోబర్ 2024 | పేజీలు 8


## బండి సంజయ్‌కు కేటీఆర్ లీగల్ నోటీసులు



**హైదరాబాద్ పెన్ పవర్:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ కేంద్రమంతి బండి సంజయ్‌కు లీగల్ నోటీసులు పంపారు. ఇటీవల ప్రెస్‌మీట్‌లో తనపై నిరాధారమైన ఆరోపణలు చేశారని, తన పరువుకు భంగం కలిగించేలా వ్యాఖ్యానించారని నోటీసులు ఇచ్చారు. డ్రగ్స్, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాల్లో తనపై నిరాధార ఆరోపణలు చేశారని నోటీసులో పేర్కొన్నారు. ఈ విషయమై వారంలోపు తనకు క్షమాపణలు చెప్పనిపక్షంలో చట్టపరమైన చర్యలు తప్పవని కేటీఆర్ హెచ్చరించారు.

# భూ దందాలో..! ఐఏఎస్ అమోయ్ కుమార్..!

## ఏడు గంటలపాటు విచారించిన ఈడీ..





అమోయ్ కుమార్ ఐఏఎస్.. ఆరోపణలు ఎదుర్కొంటున్న కలెక్టర్..

- ఈడి కార్యాలయంలోనే కొనసాగిన అమోయ్ కుమార్ విచారణ..
- రూ.కోట్ల విలువైన 42 ఎకరాల భూమిని అక్రమంగా ప్రైవేట్ వ్యక్తులకు బదిలీ చేశారని ఆరోపణ..
- రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారంలో భూదాన్ భూముల బదిలీపై ప్రశ్నించిన ఈడీ..
- అమాయ్ కుమార్ కోట్లలో ముడుపులు తీసుకున్నారని ఆరోపణలు..
- శంషాబాద్‌లో 21 ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రైవేటు పరం చేశారనే ఆరోపణలు..!
- అబ్దుల్లాపూర్ మెట్‌లో సర్వే నెంబర్ 17లో 26 ఎకరాల సాగుభూమి లాక్కున్నారని..
- ధరణిలోని లొసుగుల ఆధారంగా ప్రభుత్వ భూమిని ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేశారని ఆరోపణలు..
- మేడ్చల్ జిల్లా దుండిగల్ మండలంలోనూ ఇదే తరహాలో ధరణీ రిజిస్ట్రేషన్‌లపై అనుమానాలు..?
- బహుదూర్‌పల్లి సర్వే నెంబర్ 227 ప్రభుత్వ భూమిని 2022 జనవరిలో ధరణీ రిజిస్ట్రేషన్‌లు షురూ..
- ఇరవై ఏళ్ళు హైకోర్టు పరిధిలో ఉన్న బహుదూర్‌పల్లి 227 ప్రభుత్వ భూమిలో ఒక్కసారిగా రిజిస్ట్రేషన్‌లు.

ధరణీ పోర్టల్ తెచ్చిన తంటాలతో అధికంగా ఇబ్బందులు ఎదుర్కొన్నది పేదరైతులే.. ఉన్న కొద్దిపాటి భూమికాస్త రికార్డుల్లో తారుమారు కాగా..! వందలాది ఎకరాల ప్రభుత్వ భూములు, ఇలా ఐఏఎస్‌లు తమ మేధస్సుతో ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేశారు.. బయటపడినవి కొద్దిపాటివి మాత్రమే.. బయట పడనివి ఎన్నో ఉన్నాయి.. ఐఏఎస్ అధికారి అమోయ్ కుమార్ భూ దందాపై ఈడీ విచారణ నేపథ్యంలో..! ఇదే తరహాలో దుండిగల్ మండలంలోనూ మరికొన్ని ప్రభుత్వ భూములు ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేయడం పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా దుండిగల్ మండలం బహుదూర్‌పల్లి సర్వే నెం.227 ప్రభుత్వ భూమి 353.35 ఎకరాలు సుమారు రూ.2 వేలకోట్లు విలువైన భూముల్లో..! దాదాపు 200 ఎకరాలు ధరణీ రిజిస్ట్రేషన్‌లు, పట్టా పాసు బుక్కులు, నాలా కన్వర్శన్‌లు ముగిశాయి.. చట్టంలోని చిన్నపాటి లొసుగులతో ఏళ్ళ తరబడి హైకోర్టు పరిధిలో ఉన్న భూములకు ధరణీ రిజిస్ట్రేషన్‌లతో పట్టా భూములుగా చేయడంపై విమర్శలు ఉన్నాయి.. 227 ప్రభుత్వ భూమి ఇరవై ఏళ్ళుగా కేసులో ఉన్నప్పటికీ 2022 జనవరి నుండి ధరణీ రిజిస్ట్రేషన్‌లు ప్రారంభించారు.. "పెన్ పవర్" దినపత్రికలో వందలాది వార్తా కథనాలు వచ్చినా లెక్క పెట్టలేదు.. చివరికి అదే ప్రభుత్వ భూమిలో సీసీరోడ్లు కూడా సాంక్షన్ చేసి కబ్జాదారులకు కలెక్టర్‌లు సహకరించడం గమనార్హం..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, అక్టోబర్ 23:**

-2లో

## ఉచిత ప్రయాణం సరే.. బస్సులే శూన్యం..

### జర చూడండి సజ్జనార్ సార్



**ఉప్పల్, పెన్ పవర్ అక్టోబర్ 23:** ఉప్పల్ వరంగల్ జాతీయ రహదారి వైపుగా ప్రతినిత్యం రద్దీగా రోజువారి విద్యార్థులు, గృహిణులు, ఉద్యోగానికి వెళ్లే ఉద్యోగస్తులతో ఉప్పల్ సర్కిల్ ప్రాంతం మొత్తం ప్రయాణికుల రద్దీతో కిటకిటలాడుతుంది .ఇలాంటి జనం రద్దీగా ఉన్న ప్రాంతంలో ఉదయం 10:30 ప్రాంతం వరకు కూడా బస్సులు రాకపోవడం విద్యార్థులు బస్సుల కోసం ఎదురుచూసిన పరిస్థితి ఏర్పడుతుంది. ఉద్యోగస్తులు బస్సుల కోసం పడిగాపులు కాస్తున్నారు. మహిళలకు, విద్యార్థులకు ఉచిత ప్రయాణం కల్పించిన తెలంగాణ ప్రభుత్వం బస్సుల సంఖ్య మాత్రం పెంచకుండా వారు విధులకు వెళ్లకుండా, బస్సులను నియంత్రించి.. రోడ్డుమీదనే బస్సులకోసం పడుగాపులు పడాల్సిన అవసరం తీసుకొ చ్చారు. రోజు ఇదే తంతు ఉప్పల్ ప్రాంతంలో కనిపిస్తుంది . ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు సంబంధిత అధికారులు ప్రయాణికులను దృష్టిలో పెట్టుకొని ఉప్పల్ నుంచి ఇటు సికింద్రాబాద్ వైపు వెళ్లే బస్సుల సంఖ్యను పెంచాలని ప్రయాణికులు ,విద్యార్థులు కోరుతున్నారు. ఉచిత ప్రయాణం ఉన్నప్పటికీ బస్సులు సరిగా టైం కు రాక ప్రైవేటు వాహనంలోనే ప్రయాణించడం మంచిది అని ప్రయాణికులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు జర చూడండి సార్ అంటూ ప్రయాణికులు విన్నవిస్తున్నారు.

## లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన లైన్ ఇన్‌స్పెక్టర్




**పాల్వంచ పెన్ పవర్:** భద్రాద్రి జిల్లా పాల్వంచ సబ్ స్టేషన్ లైన్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు ఏసీబీ అధికారులకు చిక్కాడు. ఇంటికి దొంగ కరెంట్ వాడుతున్నారని బాధితుడిని బెదిరించి వారి నుంచి రూ.26 వేల లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. పాల్వంచ సబ్ స్టేషన్‌లో ఏసీబీ సోదాలు కొనసాగుతున్నాయి.

# భూ దందాలో..! ఐఏఎస్ అమోయ్ కుమార్..!


- మొదటి పేజీ తరువాయి

సీనియర్ ఐఏఎస్ అధికారి అమోయ్ కుమార్‌కు నోటీసులు జారీచేసిన ఈడీ, బుధవారం సుదీర్ఘ విచారణతో ముగిసింది.. హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయానికి చేరుకున్న అమోయ్ కుమార్‌ను దాదాపు ఏడు గంటల పాటు ఈడీ అధికారులు ప్రశ్నించారు. అమోయ్ కుమార్‌పై గతంలో భూ కేటాయింపుల్లో అక్రమాలు జరిగాయనే ఆరోపణల నేపథ్యంలో ఈడీ విచారిస్తోంది.. తెలంగాణ క్యాడర్‌కు చెందిన అమోయ్ కుమార్ రంగారెడ్డి, మేడ్చల్- మల్కాజ్‌గిరి జిల్లాలకు కలెక్టర్‌గా పని చేశారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా ఉన్న సమయంలో భూ కేటాయింపుల్లో పెద్ద ఎత్తున అవినీతి, అక్రమాలు జరిగాయని ఆరోపణలు వచ్చాయి. దీనిపై అమోయ్ కుమార్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ నోటీసులు జారీ చేసింది.. అమోయ్ కుమార్ రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న సమయంలో శంషాబాద్‌లో 21 ఎకరాల భూమిని ప్రైవేటు పరం చేశారని, ధరణిలో లొసుగుల ఆధారంగా ప్రభుత్వ భూమిని ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేశారని ఆరోపణలు వచ్చాయి.. రూ. వందల కోట్లు విలువైన 42 ఎకరాల భూమిని అక్రమంగా ప్రైవేట్ వ్యక్తులకు బదిలీ చేశారని ఆరోపణపై ఈడీ విచారణ జరిపింది..అబ్దుల్లాపూర్ మెట్‌లో సర్వే నెంబర్ 17లో ,తమ పూర్వీకుల నుండి కొంత మంది రైతులకు సంక్రమించిన 26 ఎకరాల సాగుభూములు బలవంతంగా లాక్కున్నారని ఆరోపణలు ఉన్నాయి..అమోయ్ కుమార్ స్టేట్మెంట్‌ని వీడియో చేసిన ఈడీ అధికారులు ఈడీ కార్యాలయంలో ముగిసిన సీనియర్ ఐఏఎస్ అమోయి కుమార్ విచారణ అనంతరం అమోయ్ కుమార్ మీడియా కంట పడకుండా వెళ్ళిపోయారు..









## బహుదూర్‌పల్లి 227 ప్రభుత్వ భూమిని సైతం..


# ధరణీ రిజిస్ట్రేషన్‌లు..

ధరణిలోని లొసుగుల ఆధారంగా ప్రభుత్వ భూమిని ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేశారని ఆరోపణలపై..! మేడ్చల్ జిల్లాలోనూ ఇదే తరహాలో ధరణీ రిజిస్ట్రేషన్‌లపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.. మేడ్చల్ జిల్లా దుండిగల్ మండలం బహుదూర్‌పల్లి సర్వే నెం. 227 ప్రభుత్వ భూమిలో 2022 జనవరి నుండి 2023 అక్టోబర్ వరకు ధరణీ రిజిస్ట్రేషన్‌లు, పట్టా పాసు బుక్కులు, నాలా కన్వర్షన్‌లు చేయడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.. బహుదూర్‌పల్లి సర్వే నెంబర్ 227 ప్రభుత్వ భూమి అక్రమ రిజిస్ట్రేషన్‌లపై కూడా ఈడీ దృష్టి సారిస్తే మరికొన్ని కుంభకోణాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని ఆ ప్రాంత వాసులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.. 20 ఏళ్ళు హైకోర్టు పరిధిలో ఉన్న బహుదూర్‌పల్లి 227 ప్రభుత్వ భూమిని, వక్రమార్గంలో రిజిస్ట్రేషన్ దందాపై ఈడి దృష్టి సారించాలని కోరుతున్నారు..






# రిటైర్డ్ బ్యాంకు మేనేజర్ దంపతుల హత్య

## కుటుంబ సభ్యులను పరామర్శించిన బి.ఆర్.ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టీ.ఆర్

**హైదరాబాద్, పెన్ పవర్ అక్టోబర్ 23 :** అంబర్ పేట్ లోని సాయినగర్ కాలనీలో లింగారెడ్డి, ఉర్మిళ అనే 80 ఏళ్ల వృద్ధ దంపతులను పట్టపగలు వారి ఇంటిలో దాడి చేసి కిరాతకంగా హత్య చేశారు అగంతకులు. ఈ జంట హత్యల ఘటన హైదరాబాద్ లోని ప్రతి మనిషిని, మనసు కలిచివేసింది. లింగారెడ్డి గారి ముగ్గురు కుమార్తెలు అమెరికాలో ఉన్నారు. హైదరాబాద్ లాంటి ప్రశాంతమైన నగరంలో ఇలాంటి సంఘటన జరగటంతో వారంతా భయాందోళనకు గురయ్యారు. వారి కుటుంబానికి ధైర్యం చెప్పేందుకే స్థానిక ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తో కలిసి బి.ఆర్.ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టీ.ఆర్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు హైదరాబాద్ లో 10 లక్షల సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిఏ బస్తీకి ఆ బస్తీ, ఏ గల్లీకి ఆ గల్లీ, ఏ కమ్యూనిటికీ ఆ కమ్యూనిటీ లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం అని అన్నారు. సిటిజన్ పోలీసింగ్ కూడా ఏర్పాటు చేసిపోలీస్ లకు సరైన వ్యవస్థ, స్వేచ్ఛను ఇచ్చి వారి పని వారిని చేయానిస్తే శాంతి భద్రతలు అదుపులో ఉండేలా చూసామని సందర్భంగా గుర్తు చేశారు. ఈ రాష్ట్ర ప్రభుత్వంలో




హత్య రాజకీయాలు, అత్య చారాలు వేధింపులకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడంలో విఫలమైందని విమర్శించారు. ముఖ్యమంత్రి హైదరాబాద్ నడిబొడ్డున హత్య రాజకీయాలను ప్రోత్సహిస్తూ తెలంగాణను రక్తసిక్తంగా మారుస్తూ, అనేక మరణకాండలను జరుగుతున్న చర్యలు చూపడంలో అశ్వద్ధ అశ్రద్ధ వహిస్తున్నారనీ మంత్రులు సైతం విదేశీ పర్యటనలు చేస్తూ.. ప్రజల వైపు చూసిన నాధుడే కరువయడని విమర్శించారు .ఇప్పటికైనా ముఖ్యమంత్రి తెలంగాణ సస్యశ్యామలంగా ఉంచేలా ప్రజలను సమస్యల పట్ల దృశ్య సారించాలని అన్నారు. ఈ జంట హత్య కేసులో ఇప్పటి వరకు ఎలాంటి పురోగతి లేదు. ఈ రాష్ట్రంలో శాంతి భద్రతలు అదుపు లేవు, దారుణమైన పరిస్థితులు ఉన్నాయంటూ స్వయంగా కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి, కాంగ్రెస్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి గారే చెబుతున్నారని అన్నారు

నిన్న జగిత్యాలలో జీవన్ రెడ్డి అనుచరుడిని హత్య చేశారు. ఇక్కడ హైదరాబాద్ లో వృద్ధ జంటను కిరాతకంగా హత్య జరగటంతో హైదరాబాద్ లో ప్రజలు భయంతో ఉన్నారు.

సాయిబాబా కాలనీలో సీసీ కెమెరాలు పనిచేయటం లేదని స్థానికులు చెబుతున్నారు. హైదరాబాద్ సీపీ ని, పోలీసులను నగరంలో శాంతి, భద్రతలు అదుపులో ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతు, జంట హత్యలకు పాల్పడిన నిందితులను వీలైనంత త్వరగా అరెస్ట్ చేయాలని...ఈ హత్య కేసులో నిందితులను అరెస్టు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు.

# క్వాలిటీ చెక్ చేయకుండా అఫిడవిట్ ఎలా ఇస్తారు?..కాళేశ్వరం కమిషన్ ఆగ్రహం

- సీఈ అజయ్ కుమార్ పై కాళేశ్వరం కమిషన్ ఆగ్రహం
- ఇప్పటి వరకు ఎన్ని సార్లు మేడిగడ్డ, అన్నారం విజిట్ చేశారు..?
- సుందిళ్లను ఎందుకు పరిశీలించలేదన్న కమిషన్
- మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలను ప్రమాదం జరగకముందు విజిట్ చేశానన్న సీఈ
- ఓపెన్ కోర్టు లో వాడి వేడిగా విచారణ




**హైదరాబాద్ పెన్ పవర్:** కాళేశ్వరం కమిషన్ ఓపెన్ కోర్టు విచారణ సాగుతోంది. ఇవాళ మధ్యాహ్నం తర్వాత క్వాలిటీ కంట్రోల్ చీఫ్ ఇంజనీర్ అజయ్ కుమార్ కమిషన్ ఎదుట హాజరయ్యారు. అజయ్ కుమార్ పై కమిషన్ ప్రశ్నల వర్షం కురిపించింది. క్వాలిటీ కంట్రోల్ సిఇ స్థాయిలో ఉండి రికార్డ్స్ చెక్ చేయకుండా అఫిడవిట్ ఎలా సబ్మిట్ చేస్తారని ప్రశ్నించింది. క్వాలిటీ కంట్రోల్ పని ఏంటి? పరిధి ఏంటి? ఇప్పటివరకు ఏం పని చేశారు? అంటూ ప్రశ్నల వర్షం కురిపించింది. మేడిగడ్డ, సుందిళ్ల బ్యారేజీలను ఎన్నిసార్లు విజిట్ చేశారని అడిగింది. దీనికి ఈ రెండు బ్యారేజీలను ప్రమాదం జరగక ముందు పరిశీలించానని తెలిపారు. సుందిళ్లను ఎందుకు పరిశీలించలేదని ప్రశ్నించింది. మొదటి సారి ఫ్లడ్స్ వచ్చిన తర్వాత మూడు బ్యారేజీలను క్వాలిటీ కంట్రోల్ సీఈగా విజిట్ చేశారా..? అని కమిషన్ ప్రశ్నించింది. గ్రౌండ్ లో సమస్యలు ఉన్నాయని రిపోర్టులు రావడంతో విజిట్ చేయలేదని అజయ్ కుమార్ వివరణ ఇచ్చారు.

### ఈఎన్సీకి 130 ప్రశ్నలు

ఇవాళ ఉదయం విచారణకు హాజరైన ఈఎన్సీ నాగేందర్ పై కాళేశ్వరం కమిషన్ ప్రశ్నల వర్షం కురిపించింది. దాదాపు మూడు గంటలపాటు ఆయనను ప్రశ్నించింది. దాదాపు 130కి పైగా ప్రశ్నలు వేసినట్లు తెలుస్తోంది. మేడిగడ్డ బ్యారేజీ పూర్తి అయినట్లు ఇచ్చిన సర్టిఫికెట్‌లో నిబంధనలు పాటించలేదని నాగేందర్ తెలిపారు. రామగుండం ఈఎన్‌సీ చేతిలోనే మూడు బ్యారేజీలు నడిచినట్లు కమిషన్ ముందు చెప్పారు. ఆయన నిబంధనలు పాటించలేదని తెలిపారు. మెయింటెనెన్స్ సరిగ్గా లేకపోవడం వల్లే బ్యారేజీలలో లీకేజీలు జరిగాయా అని.. గేట్స్ ఆపరేషన్ ఎవరి ఆధ్వర్యంలో జరుగుతాయి? నీళ్లను ఎవరు స్టోరేజ్ చేయమన్నారని కమిషన్ ప్రశ్నించింది. వరదల సమయంలో గేట్లు ఓపెన్ చేయకూడదని ఎవరు ఆదేశించారని అడిగింది. మెయింటెనెన్స్ అండ్ ఆపరేషన్ డిపార్ట్‌మెంట్ మాన్యువల్ ప్రిపేర్ చేసిందా అంటూ ఈఎన్‌సీ నాగేందర్‌ను కాళేశ్వరం కమిషన్ ప్రశ్నించినట్టు తెలుస్తోంది.

2021 జనవరి వరకు ఆపరేషన్ సైన్ మెయింటెనెన్స్ కోసం ప్రత్యేకమైన సిబ్బంది లేరని కమిషన్ ముందు నాగేందర్ తెలిపారు. 2021 జనవరిలో ఆపరేషన్ అండ్ మైంటెనెన్స్ టీం ఫామ్ అయిన తర్వాత రామగుండం ఈఎన్‌సీకి రిపోర్టు ఇచ్చామని తెలిపారు.

# కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అనుచరుడి హత్యకేసు.. నిందితుడు సంతోష్ అరెస్ట్

- జీవన్‌రెడ్డి అనుచరుడు గంగారెడ్డిని పొడిచి చంపిన నిందితుడు
- సంతోష్ సెల్‌ఫోన్ డేటాను విశ్లేషించిన పోలీసులు
- హత్యకు గల కారణాలపై ఆరా



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ కాంగ్రెస్ సీనియర్ నేత, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అనుచరుడు మారు గంగారెడ్డి (58) హత్యకేసు నిందితుడు సంతోష్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి నుంచి కారు, హత్యకు ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకుని విచారిస్తున్నారు. సంతోష్ మొబైల్ ఫోన్ డేటాను పరిశీలించిన పోలీసులు ఘటనకు ముందు అతడు ఎవరెవరితో మాట్లాడాడన్న విషయాన్ని నిర్ధారించుకున్నట్టు తెలిసింది. ప్రస్తుతం అతడిని ఓ పోలీస్ స్టేషన్‌లో ఉంచి ప్రశ్నిస్తున్న పోలీసులు హత్యకు గల కారణాలపై ఆరా తీస్తున్నారు. జీవన్‌రెడ్డికి నాలుగు దశాబ్దాలుగా రాజకీయ అనుచరుడిగా కొనసాగుతున్న గంగారెడ్డి నిన్న ఉదయం జగిత్యాలలోని తన సొంత గ్రామం జాబితాపూర్‌లో బైక్‌పై వెళ్తుండగా బత్తిని సంతోష్‌గౌడ్ కారుతో వెనక నుంచి ఢీకొట్టాడు. కిందపడిన గంగారెడ్డిపై అందరూ చూస్తుండగానే కత్తితో దాడిచేశాడు. చాతీలో, కడుపులో విచక్షణ రహితంగా పొడిచాడు. ఆపై తన సెల్‌ఫోన్‌ను వేరే చోట పడేసి మరో కారులో పరారయ్యాడు.

## బిగ్ బాస్ గంగవ్వపై కేసు నమోదు. ఎందుకంటే.?



హైదరాబాద్ పెన్ పవర్:మైవిలేజ్ షో ద్వారా గుర్తింపు పొందిన గంగవ్వ చిక్కుల్లో పడ్డారు. గంగవ్వతో పాటు యూట్యూబర్ రాజు పై అటవీశాఖ అధికారులు, వైల్డ్ లైఫ్ కింద జగిత్యాల ఎఫ్.ఆర్.ఓ. పద్మారావు కేసు నమోదు చేశారు. 2022 సంవత్సరం మే నెలలో తీసిన ఓ వీడియోలో చిలుకను ఉపయోగించడంపై వచ్చిన ఫిర్యాదు నేపథ్యంలో కేసు నమోదు చేసినట్లు ఎఫ్ఆర్ఓ పద్మారావు తెలిపారు. యూట్యూబ్ ప్రయోజనాల కోసం చిలుకను హింసించి వన్యప్రాణుల రక్షణ చట్టాన్ని ఉల్లంఘించారని ఫిర్యాదు చెయ్యడంతో జంతు సంరక్షణ కార్యకర్త గౌతమ్ ఈ ఘటనపై ఫిర్యాదు చేసినట్లుగా ఎఫ్ఆర్ఓ తెలిపారు. దీంతో యూట్యూబర్ రాజు 25వేల రూపాయల ఫైన్ కట్టారు. బిగ్ బాస్ గంగవ్వపై కేసు నమోదు. ఈ విషయం ఇలా ఉండగా ప్రస్తుతం గంగవ్వ ప్రముఖ ఎంటర్టైన్మెంట్ చానెల్ అయిన స్టార్ మాలో ప్రసారం అవుతున్న తెలుగు బిగ్ బాస్ 8 వ సీజన్ లో కంటెస్టెంట్ గా పాల్గొంటుంది. గతంలో 4 వ సీజన్ లో కంటెస్టెంట్ గా పాల్గొని ఆడియన్స్ ని బాగానే ఆకట్టుకోగా ఈసారి వైల్డ్ కార్డ్ ఎంట్రీ ద్వారా కంటెస్టెంట్ గా ఎంట్రీ ఇచ్చింది.

## నాగార్జున పరువునష్టం దావా... కోర్టులో కొండా సురేఖ రిప్లై దాఖలు

- కొండా సురేఖ తరపున రిప్లై దాఖలు చేసిన న్యాయవాది గుర్మీత్ సింగ్
- తదుపరి విచారణను ఈ నెల 30కి వాయిదా వేసిన కోర్టు
- ఇదివరకే నాగార్జున సహా సాక్షుల వాంగ్మూలం నమోదు చేసిన కోర్టు



హైదరాబాద్ పెన్ పవర్:సినీ నటుడు నాగార్జున వేసిన పరువు నష్టం దావాకు సంబంధించి మంత్రి కొండా సురేఖ నాంపల్లి ప్రత్యేక కోర్టులో రిప్లై ఫైల్ చేశారు. నాగచైతన్య, సమంత విడాకుల విషయంలో నాగార్జునపై కొండా సురేఖ సంచలన వ్యాఖ్యలు చేశారు. దీంతో నాగార్జున పరువు నష్టం దావా వేశారు. నాగార్జున సహా సాక్షుల వాంగ్మూలాన్ని కోర్టు ఇదివరకే నమోదు చేసింది. ఈ క్రమంలో తాజాగా, మంత్రి రిప్లైని ఫైల్ చేశారు.

మంత్రి తరఫున ప్రముఖ న్యాయవాది గుర్మీత్ సింగ్ కోర్టులో సమాధానాన్ని ఫైల్ చేశారు. అనంతరం కోర్టు తదుపరి విచారణను ఈ నెల 30వ తేదీకి వాయిదా వేసింది. నాగార్జునపై కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపాయి. ఆమె వ్యాఖ్యలను టాలీవుడ్ ప్రముఖులు తీవ్రంగా ఖండించారు.

# జీవన్ రెడ్డి విమర్శలపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు

- ఫిరాయింపులు పార్టీ విధానానికి వ్యతిరేకమని, ఫిరాయించిన వారిపై వేటు వేయలన్న జీవన్ రెడ్డి
- ఆ వ్యాఖ్యలు జీవన్ రెడ్డి వ్యక్తిగతమన్న టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్
- అందరితో చర్చించాకే ఎమ్మెల్యేలను చేర్చుకున్నట్లు వెల్లడి



హైదరాబాద్ పెన్ పవర్:ఫిరాయింపులు కాంగ్రెస్ పార్టీ విధానానికి వ్యతిరేకమని, బీఆర్ఎస్ నుంచి ఫిరాయించిన ఎమ్మెల్యేలపై వేటు వేయాల్సిందేనని సొంత పార్టీ సీనియర్ నేత జీవన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఫిరాయింపులపై జీవన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు వ్యక్తిగతమంటూ కీలక వ్యాఖ్య చేశారు. పార్టీలో చేరికల గురించి మాట్లాడుతూ... అందరితో చర్చించాకే ఎమ్మెల్యేలను చేర్చుకున్నట్లు తెలిపారు.

తమకు ప్రతి ఒక్కరూ అవసరమేనని... ఏ కార్యకర్తనూ వదులుకోమన్నారు. ఇతర పార్టీల నుంచి ప్రజాప్రతినిధులను చేర్చుకోవాలన్నది అధిష్ఠానం నిర్ణయమే అన్నారు. పెద్దల సూచన ప్రకారమే ఎమ్మెల్యేలను చేర్చుకున్నట్లు తెలిపారు. జీవన్ రెడ్డి ప్రతిష్ఠకు ఎక్కడా భంగం వాటిల్లదని హామీ ఇచ్చారు. ఆయన ప్రధాన అనుచరుడు గంగారెడ్డి హత్యపై ఉన్నతాధికారులతో మాట్లాడినట్లు చెప్పారు. ఈ హత్య కేసుపై విచారణ సాగుతోందని, త్వరలో అన్ని విషయాలు బయటకు వస్తాయన్నారు. ఈ ఘటన జరిగిన వెంటనే తాను జీవన్ రెడ్డితో మాట్లాడానని గుర్తు చేశారు. ఆయన ఆవేదనలో ఉన్నారని, అందుకే అలా మాట్లాడుతున్నారన్నారు. ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరిన నాయకులు పాతవారిని కలుపుకు పోవాలని సూచించారు. జగిత్యాల మాత్రమే కాదని, ఇతర ప్రాంతాల్లో కూడా కొత్త, పాత నాయకుల సమస్య ఉందన్నారు.

# మీ పార్టీ జీవన్ రెడ్డే ఫిరాయింపులు దుర్మార్గమన్నాడు... లెంపలు వేసుకుంటావా?: రేవంత్ రెడ్డిపై కేటీఆర్ ఫైర్

- జీవన్ రెడ్డి వంటి నేతనే ఫిరాయింపులు పార్టీ వ్యతిరేకమని చెప్పారన్న కేటీఆర్
- పార్టీ మారిన ఎమ్మెల్యేలపై వేటు వేయాలని జీవన్ రెడ్డి డిమాండ్ చేస్తున్నారన్న కేటీఆర్
- రేవంత్ రెడ్డి దృష్టిలో డబుల్ ఇంజిన్ అంటే మోదీ ప్లస్ అదానీ అని ఎద్దేవా



హైదరాబాద్ పెన్ పవర్: రేవంత్ రెడ్డి గారూ... మీ సొంత పార్టీ సీనియర్ నేతనే ఎమ్మెల్యేల ఫిరాయింపులు అప్రజాస్వామికమని, దుర్మార్గమని చెబుతున్నారు... ఇప్పటికైనా మీరు లెంపలు వేసుకుంటారా? అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు.

జీవన్ రెడ్డిలాంటి సీనియర్ నాయకుడే ఇది (ఫిరాయింపులు) కాంగ్రెస్ విధానాలకు వ్యతిరేకమని చెబుతున్నారని తెలిపారు. మీ దిగజారుడు రాజకీయాలపై ఆయన దుమ్మెత్తి పోశారని వెల్లడించారు. ఇప్పటికైనా మీరు చేసిన తప్పును ఒప్పుకుంటారా? క్షమాపణ చెబుతారా? అని నిలదీశారు. మీరు గడప గడపకు వెళ్లి... చేర్చుకున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై చట్టప్రకారం వేటు వేయల్సిందేనని ఆయన కూడా పట్టుబడుతున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికైనా ఫిరాయింపు ఎమ్మెల్యేలపై చర్యలు ఉంటాయా? ఇప్పుడు రాయితో కొట్టాల్సింది ఎవరిని? ఫిరాయించిన ఎమ్మెల్యేలనా? ప్రోత్సహించిన మిమ్మల్నా? అని ప్రశ్నల వర్షం కురిపించారు. కాగా, కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై వేటు వేయాల్సిందేనని జీవన్ రెడ్డి సొంత పార్టీని డిమాండ్ చేశారు.

### రేవంత్ రెడ్డి దృష్టిలో డబుల్ ఇంజిన్ అంటే మోదీ ప్లస్ అదానీ

రేవంత్ రెడ్డి దృష్టిలో డబుల్ ఇంజిన్ అంటే మోదీ, అదానీ అని కేటీఆర్ విమర్శించారు. అందుకే వాళ్లిద్దరికీ కావాల్సిన పనులను చక్కబెడుతూ వారి చల్లని చూపు తనపై ఉండేలా చూసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ప్రధాని ఆదేశానుసారమే రేవంత్ నడుచుకుంటున్నారని ఆరోపించారు. బడే భాయ్ ఆజ్ఞలను ముఖ్యమంత్రి తూచా తప్పకుండా పాటిస్తున్నారని, అదాని సంతృప్తి కోసం ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. అదానికి మేలు చేసేలా రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోందని ధ్వజమెత్తారు. అందుకే ముఖ్యమంత్రి దుర్మార్గాలపై బీజేపీ మౌనంగా ఉంటుందని ఆరోపించారు. మూసీ దిగువన రామన్నపేటలో అంబుజా సిమెంట్ ప్లాంట్ కోసం బూటకపు ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# యూపీఐ వర్సెస్ యూపీఐ వాలెట్.. ఈ రెండింటిలో ఏది బెస్ట్?

- చిన్నచిన్న లావాదేవీల కోసం యూపీఐ వాలెట్ విధానాన్ని తీసుకొచ్చిన ఎన్‌పీసీఐ
- ఒక లావాదేవీకి గరిష్ఠంగా రూ.1000.. రోజులో అత్యధికంగా రూ.10,000 మాత్రమే బదిలీ చేసే అవకాశం
- సైబర్ మోసాలు జరిగితే కలిగే నష్టం తక్కువ ఉండే అవకాశం




**హైదరాబాద్ పెన్ పవర్:**దేశంలో నగదు రహిత ఆర్థిక వ్యవస్థను ప్రోత్సహించడంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యూపీఐ చెల్లింపుల విధానం అంతకంతకూ వృద్ధి చెందుతోంది. మొబైల్ నంబర్ ద్వారా బ్యాంక్ ఖాతాలను అనుసంధానం చేసుకుని సులభంగా వినియోగించుకునే అవకాశం ఉండడంతో చాలా మంది ఈ చెల్లింపుల విధానంలోకి మారారు, ఇంకా మారుతున్నారు. దీంతో జేబులో నగదు తీసుకెళ్లే వారి సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. ఈ నేపథ్యంలో యూపీఐ చెల్లింపుల విధానాన్ని మరింత సురక్షితంగా, సులభంగా మార్చడంలో భాగంగా ఎన్‌పీసీఐ (నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) ఎప్పటికప్పుడు మార్పులు తీసుకొస్తోంది. ఇందులో భాగంగా చిన్నచిన్న లావాదేవీల కోసం 'యూపీఐ వాలెట్' విధానాన్ని ఈ మధ్యే ప్రవేశపెట్టింది.

**యూపీఐ వర్సెస్ యూపీఐ వాలెట్ ఏది బెస్ట్..**

యూపీఐ పేమెంట్లతో పోల్చితే యూపీఐ వాలెట్ పేమెంట్లు మరింత సౌకర్యవంతంగా, పలు విధాలా సురక్షితంగా ఉంటాయి. యూపీఐలో వినియోగదారుడు తన బ్యాంకు ఖాతాలను అనుసంధానం చేయాల్సి ఉంటుంది. యూపీఐ వాలెట్‌లో బ్యాలెన్స్‌ను యూపీఐ నుంచి ట్రాన్స్‌ఫర్ చేసుకోవాల్సి ఉంటుంది. యూపీఐలో బ్యాంక్ ఖాతాలను అనుసంధానించుకుంటే, యూపీఐ వాలెట్‌లో యూపీఐకి లింక్ చేసుకోవాల్సి ఉంటుంది. యూపీఐ విధానంలో ట్రాన్స్‌ఫర్ చేసే నగదు బ్యాంక్ ఖాతాల నుంచి కట్ అవుతుంది. అయితే యూపీఐ వాలెట్‌లో మాత్రం వాలెట్ నుంచి అవతలి వ్యక్తి బ్యాంక్ ఖాతాకు బదిలీ అవుతుంది. యూపీఐ వాలెట్‌ను ఉపయోగించి చిన్న చిన్న లావాదేవీలు మాత్రమే చేయాల్సి ఉంటుంది. ఒక ట్రాన్సాక్షన్‌లో గరిష్ఠంగా రూ. 1000 మాత్రమే పంపించే అవకాశం ఉంటుంది. ఒక రోజులో గరిష్ఠంగా రూ. 10,000 వరకు పంపించవచ్చు. కాబట్టి ఇందులో సైబర్ మోసాలు జరిగినా రిస్క్‌లో ఉండే డబ్బు తక్కువగా ఉంటుంది. ఇక యూపీఐ వాలెట్‌లో యూపీఐ మాదిరిగా డబ్బు బదిలీ చేసే ప్రతిసారీ పిన్‌ను ఎంటర్ చేయాల్సిన అవసరం లేదు. దీంతో చెల్లింపులను వేగంగా, సులభంగా చేసేందుకు అవకాశం ఉంది. కిరాణా దుకాణాలు, టీ స్టాల్ వంటి చిన్న ఖర్చులకు యూపీఐ వాలెట్ ప్రయోజనకరంగా ఉంటుంది. మొత్తంగా యూపీఐ వాలెట్ పరిధి తక్కువే అయినా భద్రత, సౌలభ్యం విషయంలో కాస్త మెరుగనే చెప్పుకోవాలి.

# ఆన్‌లైన్ ఫుడ్ కాస్ట్‌లీ గురూ.. ! మరోసారి ప్లాట్‌ఫామ్ ఫీజు పెంచిన జొమాటో




**హైదరాబాద్ పెన్ పవర్:**ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ సంస్థ జొమాటో వినియోగదారులకు షాకిచ్చింది. ప్లాట్‌ఫామ్ ఫీజును మరోసారి పెంచింది. దీపావళి పండగ రద్దీని దృష్టిలో ఉంచుకొని 6 రూపాయలుగా ఉన్న ప్లాట్‌ఫామ్ ఫీజును రూ. 10 చేసింది. ఈ పెంపు ప్రతి ఆన్‌లైన్ ఫుడ్ ఆర్డర్ ధరపై ప్రభావం చూపనుంది.

**ఏడాదిలో నాలుగు సార్లు పెంపు**

గతేడాది ఆగస్టులో జొమాటో సంస్థ ప్లాట్‌ఫామ్ ఫీజును పరిచయం చేసింది. అప్పుడు 2 రూపాయలు. ఆనాటి నుంచి ఇప్పటివరకూ నాలుగు సార్లు పెంపు చేపట్టడం గమనార్హం. 2 రూపాయితో మొదలు పెట్టి.. రూ. 3, రూ. 4.. రూ. 6... అంటూ మెల్లగా 10 రూపాయలు చేసేసింది. ఈ ఏడాది ప్రారంభంలో ఆర్డర్‌కు రూ. 4 నుంచి రూ. 6కు పెంచిన రుసుముతో పోలిస్తే ఇది గణనీయమైన పెరుగుదల. ఏకంగా 60 శాతం పెంచింది. ఇప్పుడు వినియోగదారుల నుండి ఆర్డర్‌కు రూ. 10 చొప్పున వసూలు చేస్తోంది.

**పెంపును సమర్థించిన జోమాటో**

పండుగల సీజన్‌లో అధిక డిమాండ్‌కు అనుగుణంగా నిర్వహణ ఖర్చులు, వేగవంతమైన సర్వీసుల కోసం ప్లాట్‌ఫామ్ ఫీజులను పెంచడం అవసరమని జొమాటో స్పష్టం చేసింది. వినియోగదారులకు తక్షణ సేవలు అందించడంలో ఈ రుసుము సహాయపడుతుందని పేర్కొంది.

**వినియోగదారుల జేబులకు చిల్లు**

ప్లాట్‌ఫామ్ ఫీజు అనేది నిర్దిష్ట ప్లాట్‌ఫామ్‌ను ఉపయోగించుకున్నందుకు వసూలు చేసే రుసుము. దీనికి డెలివరీ ఛార్జీలు, రెస్టారెంట్ ఛార్జీలు, %+గూ% వంటివి అదనం. తాజా పెంపుతో, జొమాటో వినియోగదారులు ప్లాట్‌ఫామ్ ఫీజులో రూ. 10తో కలిపి భారీగానే ముట్టచెప్పాల్సి ఉంటుంది. ప్రత్యర్థి ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ స్విగ్గీ సైతం ప్లాట్‌ఫామ్ ఫీజులను అమలు చేస్తోంది. ప్రస్తుతం స్విగ్గీ.. ఆర్డర్‌కు రూ. 6.50ల చొప్పున ప్లాట్‌ఫామ్ ఫీజు వసూలు చేస్తోంది.

## కెనడాలో అనుమానాస్పదంగా భారతీయురాలు మృతి.. వాల్‌మార్ట్ వాక్ ఇన్ ఓవెన్‌లో శవం




**హైదరాబాద్ పెన్ పవర్:**ఒట్టావా: కెనడాలో భారతీయ మహిళ అనుమానాస్పదంగా మృతిచెందిన న్యూస్ ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శనివారం ( అక్టోబర్ 19) రాత్రి హాలాఫాక్స్ సిటీలో వాల్ మార్ట్ స్టోర్ బేకరీ డిపార్ట్ మెంట్ వాక్ ఇన్ ఓవెన్ లో 19యేళ్ల సిక్కు మహిళ శవమై కనిపించింది. ఓ గుర్తు తెలియన మహిళ హాలిఫాక్స్ ప్రాంతంలోని వాల్ మార్ట్ స్టోర్ లో పనిచేస్తుందని... శనివారం రాత్రి ఆమె హఠాత్తుగా చనిపోయారని స్థానిక పోలీసులు చెబుతు న్నారు. మృతి చెందిన మహిళ ఇటీవల ఇండియానుంచి కెనడాకు వచ్చిందని .. ఆమె సిక్కు సంఘానికి చెందినవారని కెనడా మారిటైమ్ సిక్క్ సొసైటీ తెలిపింది. సిక్కు మహిళ మృతికి కారణాలపై స్థానిక పోలీసులు విచారణ చేపట్టారు. మహిళ పనిచేస్తున్న వాల్ మార్ట్ షాపును మూసివేశారు.

అయితే సిక్కు మహిళ మృతికి సంబంధించిన న్యూస్ స్థానిక సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఆమె మృతిపై పలు అనుమానాలు వ్యక్తం చేశారు. విచారణ జరుగుతోంది. అసత్య ప్రచారాన్ని నమ్మొద్దని స్థానిక పోలీసులు మృతురాలి కుటుంబ సభ్యులను కోరారు.

## సమంత, నాగచైతన్య నావల్లే విడిపోయారంటూ సురేఖ అసహ్యంగా మాట్లాడారు:

### కోర్టులో కేటీఆర్ సుదీర్ఘ వాంగ్మూలం

**హైదరాబాద్ పెన్ పవర్:**మంత్రి కొండా సురేఖ తనపై చేసిన వ్యాఖ్యలు అసహ్యంగా ఉన్నాయని, వివరంగా ఆమె అన్న మాటలు చెప్పమంటే చెబుతానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నాంపల్లి ప్రత్యేక కోర్టులో వాంగ్మూలం ఇచ్చారు. సమంత, నాగచైతన్య తన వల్లే విడిపోయారని తీవ్ర ఆరోపణలు చేశారని వెల్లడించారు. కొండా సురేఖపై పరువునష్టం దావాకు సంబంధించి ఈరోజు కేటీఆర్ నాంపల్లి ప్రత్యేక కోర్టులో వాంగ్మూలం ఇచ్చారు. మంత్రి కొండా సురేఖ ఏం వ్యాఖ్యలు చేశారని కోర్టు ఈ సందర్భంగా ప్రశ్నించారు. ఫిర్యాదులో అన్ని విషయాలు ఉన్నాయని కేటీఆర్ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు.

దానినే ప్రామాణికంగా తీసుకోమంటారా? లేక మళ్లీ స్టేట్‌మెంట్ ఇస్తారా? అని కోర్టు ప్రశ్నించింది.కొండా సురేఖ తనపై చేసిన వ్యాఖ్యలు అసహ్యంగా ఉన్నాయన్నారు. వివరంగా చెప్పడానికి సిద్ధమే అన్నారు. ఈ సందర్భంగా సురేఖ ఈ వ్యాఖ్యలు చేశారంటూ కొన్నింటిని చెప్పారు. ఫోన్ ట్యాపింగ్ చేశానని, తాను డ్రగ్స్ తీసుకుంటానని ఆరోపణలు చేసినట్లు చెప్పారు. ఇతరులు డ్రగ్స్ తీసుకునేలా తాను ప్రేరేపించినట్లు చెప్పారన్నారు. తన వల్లే కొన్ని పెళ్లిళ్లు బ్రేక్ అయినట్లుగా కూడా వ్యాఖ్యలు చేశారన్నారు.

ఆమె చేసిన వ్యాఖ్యలు చదవాలంటేనే ఇబ్బందికరంగా ఉందని కేటీఆర్ కోర్టుకు తెలిపారు. ఫిర్యాదులోని అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని కోర్టును కోరారు. నోటితో అన్నీ చెప్పలేని విధంగా ఉన్నాయన్నారు. బాధ్యత గల పదవిలో ఉండి తన పరువుకు భంగం కలిగేలా వ్యాఖ్యలు చేశారన్నారు.

సాక్షులు దాసోజు శ్రవణ్, బాల్క సుమన్, సత్యవతి రాథోడ్ తనకు పద్దెనిమిదేళ్లుగా తెలుసునని... కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలను టీవీలో చూసి వాళ్లు తనకు ఫోన్ చేసి చెప్పారని కోర్టుకు తెలిపారు. సురేఖ వ్యాఖ్యలతో నా పరువు, ప్రతిష్ట దెబ్బతిన్నాయన్నారు. తనతో పాటు బీఆర్ఎస్ పార్టీకి నష్టం చేయాలని ఆమె ఇలాంటి వ్యాఖ్యలు చేశారన్నారు. కోర్టు అరగంట పాటు కేటీఆర్ వాంగ్మూలాన్ని నమోదు చేసింది. అనంతరం కేసు తదుపరి విచారణను కోర్టు ఈ నెల 30వ తేదీకి వాయిదా వేసింది.

## గంగులను పరామర్శించిన హరీష్ రావు



**కరీంనగర్: పెన్ పవర్:** కరీంనగర్లోని మాజీ మంత్రి గంగుల కమలాకర్ నివాసానికి చేరుకొని వారి మాతృమూర్తి పార్థివ దేహానికి మాజీ మంత్రి హరీష్ రావు నివాళులర్పించారు. ఈ సందర్భంగా గంగుల కమలాకర్, అయన కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. హరీష్ రావు తో పాటు మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డి, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి, ఇతర బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## వైకాపా కు గుడ్ బై

**హైదరాబాద్ పెన్ పవర్:**వైయస్ఆర్ సీపీకు రాజీనామా చేస్తూ మీడియా ద్వారా తెలియచేస్తున్నానువాసిరెడ్డి పద్మవిజయవాడ మహిళా కమిషన్ మాజీ ఛైర్ పర్సన్ వాసిరెడ్డి పద్మ వైకాపా సభ్యత్వానికి రాజీనామా చేసారు. పార్టీలో కష్టపడిన వారి కోసం ఇప్పుడు జగన్ 'గుడ్ బుక్' , ప్రమోషన్లు అంటున్నారు. నాయకులు, కార్యకర్తల కోసం ఉండాల్సింది 'గుడ్ బుక్' కాదు " గుండె బుక్ ". వారికి ప్రమోషన్ పదం వాడటానికి రాజకీయపార్టీ వ్యాపార కంపెనీ కాదు. జీవితాలు , ప్రాణాలు పెట్టిన కార్యకర్తలు అవసరం లేదు అనుకునే జగన్ 'గుడ్ బుక్' పేరుతో మరోసారి మోసం చెయ్యడానికి సిద్ధపడుతున్నారు. పార్టీని నడిపించడంలో జగన్ కి బాధ్యత లేదు. పరిపాలన చేయడంలో బాధ్యత లేదు. సమాజం పట్ల అంతకన్నా బాధ్యత లేదు. అప్రజాస్వామిక పద్ధతులు, నియంతృత్వ ధోరణులు ఉన్న నాయకుడుని ప్రజలు మెచ్చుకోరని ఈ ఎన్నికల తీర్పు స్పష్టం చేసింది. వ్యక్తిగతంగా, విధానాలపరంగా అనేక సందర్భాల్లో అసంతృప్తి ఉన్నప్పటికీ ఒక నిబద్ధత కలిగిన నాయకురాలిగా పార్టీలో పనిచేసాను. ప్రజాతీర్పు తర్వాత అనేక విషయాలు సమీక్షించుకుని అంతర్మథనం చెంది వైకాపా ను వీడాలని నిర్ణయం తీసుకున్నానని తెలియజేస్తున్నానని ఆమె అన్నారు.

## గోషామహల్ లో భారీగా కుంగిన నాలా రోడ్డు



**హైదరాబాద్ పెన్ పవర్:**గోషామహల్ లో నాలా రోడ్డు రెండవసారి భారీగా కుంగింది. దారుసలామ్ రోడ్డు నుండి చాక్నావాడికి వెళ్లే రోడ్డు లో ప్లైవుడ్ దుకాణాల ముందు ఘటన జరిగింది. మంగళవారం అర్ధరాత్రి రెండు 2గంటల ప్రాంతంలో శివరేజ్ పెద్ద నాలా కుంగిపోయింది. అర్ధరాత్రి కావడంతో ఎవరు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. అతిపురాతన మైనా నాలా కావడంతో కుంగినట్లుగా స్థానికులు చెబుతున్నారు. 200వందల మీటర్ల దూరంలో గతంలో కూడా ఇదే నాలా కుంగింది.

# నాలుగు నెలల్లో 77 మంది మహిళలు, పిల్లలపై అఘాయిత్యాలు


### ఏడుగురు హత్య, ఐదుగురు ఆత్మహత్య :వైఎస్ జగన్

**హైదరాబాద్ పెన్ పవర్:** గుంటూరులో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్ బుధవారం పర్యటించారు. గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో సహాన మృతదేహానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

వైయస్ జగన్ మాట్లాడుతూ రాష్ట్రంలో దారుణమైన పరిస్థితులు ఉన్నాయి. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ లేదు. శాంతిభద్రతలు ఎలా దిగజారాయో ఈ ఘటన చూస్తే తెలుస్తుంది. వైసీపీ అధికారంలోకి ఉండగా అక్క చెల్లెమ్మలకు భరోసా ఉండేది. దిశ యాప్ ద్వారా ఆపదలో ఉన్న మహిళలకు అండగా నిలిచాం. నిందితుడు నవీన్ బాబుతో కలిసి దిగిన ఫోటోలు ఉన్నాయి. స్థానిక ఎంపీతో కూడా సన్నిహితంగా ఉన్నాడు. యువతిని ఆస్పత్రిలో పడేసి జారుకున్నాడు. యువతి దేహంపై కమిలిన గాయాలు ఉన్నాయి. శారీరకంగా, లైంగికంగా దాడి చేశాడు. యువతిపై మృగాళ్లలా దాడి చేశారు. ఇవన్నీ కళ్లెదుటే కనిపిస్తున్నా.. ప్రభుత్వం దాచిపెట్టే ప్రయత్నం చేస్తోంది. టీడీపీకి చెందినవాడు కాబట్టే.. నిందితుడ్ని నిస్సిగ్గుగా కాపాడుకుంటున్నారని అన్నారు.

ఘటనపై స్థానిక మంత్రి, హోంమంత్రి కనీసం స్పందించలేదు. నేను వస్తున్నానని తెలిశాకే టీడీపీ నేత ఆలపాటి వచ్చారట. తప్పు జరగలేదని ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తోంది. రాష్ట్రంలో ప్రతిచోట అత్యాచారాలు జరుగుతూనే ఉన్నాయి. బద్వేల్ లో కూడా ఇలాంటి ఘటనే జరిగింది. బాలికపై అత్యాచారం చేసి పెట్రోల్ పోసి నిప్పంటించారు. శ్రీకాకుళం జిల్లాలో ఇద్దరు బాలికలపై అఘాయిత్యం జరిగింది. కూల్ డ్రింక్స్ లో మత్తుమందు కలిపి అత్యాచారం చేశారు. పలాసలో టీడీపీకి చెందిన ప్రబుద్ధులే అత్యాచారం చేశారు. అత్యాచారాలు జరిగిన చోట పంచాయితీలు చేస్తున్నారు. పిఠాపురంలో యువతిపై టీడీపీ నేత అత్యాచారం చేశాడు. టీడీపీ కార్పొరేటర్ భర్త బాలికపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. పవన్ కనీసం బాలిక కుటుంబాన్ని పరామర్శించారా?. హిందూపురంలో అత్తాకోడళ్లపై గ్యాంగ్ రేప్ చేస్తే, నిందితులను అరెస్ట్ చేయాలన్న ఆలోచన రాలేదు. హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణకు చూడటానికి టైం ఉండదు . అనకాపల్లిలో ప్రేమోన్మాది సురేష్ యువతిని చంపేశాడు. పోలీసులు రెడ్ బుక్ పాలనలో నిమగ్నమయ్యారు. బాబు అధికారంలోకి వచ్చిన 4 నెలల పాలనలో 77 మంది మహిళలు, పిల్లలపై అఘాయిత్యాలు జరిగాయి. ఏడుగురు హత్య, ఐదుగురు ఆత్మహత్య చేసుకున్నారు. రెడ్ బుక్ పాలనలో టీడీపీ నేతల తప్పులకు శిక్ష ఉండదు. గతంలో దిశ యాప్ తో 10 నిమిషాల్లో సాయం. దిశ యాప్ ద్వారా 31,607 మంది మహిళలను కాపాడాం. 18 దిశ పీఎస్ లు, 13 పోక్సో కోర్టులు ఏర్పాటు చేశాం. ప్రతి జిల్లాలోనూ పబ్లిక్ ప్రాసిక్యూటర్లను నియమించాం. దిశ యాప్ కు 19 అవార్డులు వచ్చాయి. దిశ చట్టం ప్రతులను బుద్ధి ఉన్నోడు ఎవడైనా కాల్చేస్తాడా?. లోకేష్ పక్కనే ప్రస్తుత హోంమంత్రి కూడా ఇదే పనిచేశారు. రాష్ట్రంలో అక్క చెల్లెమ్మలకు భద్రత లేదు. ప్రతి బాధిత కుటుంబానికి చంద్రబాబు క్షమాపణ చెప్పాలి. ప్రతిపక్షంలో ఉన్న మేం బాధిత కుటుంబాలను ఆదుకుంటాం. ఆరు కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున సాయం. దళితులంతా నా వాళ్లే.. అండగా ఉంటా నని అన్నారు. పేదల పక్షాన ఎంత దూరమైనా పోరాడతా. వచ్చేది మన ప్రభుత్వమే. నిందితులను వెంటాడి జైల్లో పెడతామని అన్నారు.

## హాస్టల్ కిటికీలో నుంచి దూకిన విద్యార్థి మృతి



**హైదరాబాద్ పెన్ పవర్:** మాదాపూర్ పరిధిలోని నారాయణ కాలేజ్ హాస్టల్ నుండి కిందకి దూకి మృతి చెందాడు. స్నేహితులతో కలిసి బయటకు వెల్దామని కిటికీలో నుండి కిందకు దిగేందుకు శివకుమార్ రెడ్డి (17) ప్రయత్నించాడు. ఐదవ అంతస్తు నుంచి జారిపడి విద్యార్థి మృతి చెందాడు. రైల్వే కోడూరుకు చెందిన శివ కుమార్ రెడ్డి మాదాపూర్ నారాయణ రెసిడెన్షియల్ కాలేజీ వర్మ క్యాంపస్ లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. మెయిన్ గేట్ కు తాళాలు వేసి ఉండడంతో కిటికీలో నుండి గ్రిల్స్ పట్టుకుని కిందకు దిగేందుకు ప్రయత్నించాడు. ఇది గమనించిన మిగతా స్నేహితులు తమ ప్రయత్నాన్ని విరమించుకుని వెనక్కి వచ్చి హాస్టల్ వార్డెన్ కు విషయం తెలిపారు. దీంతో వెంటనే ఘటనా స్థలానికి చేరిన హాస్టల్ వార్డెన్ విద్యార్థి శివకుమార్ రెడ్డిని లేపి చూడగా అతనికి తీవ్రంగా గాయాలయ్యాయి. వెంటనే దగ్గరలో ఉన్న మెడికవర్ ఆస్పత్రికి తరలించగా శివకుమార్ రెడ్డి అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. నారాయణ కాలేజీ నుంచి పడి విద్యార్థి మృతి చెందిన విషయం తెలుసుకున్న పలు విద్యార్థి సంఘాల నాయకులు ఘటన స్థలానికి చేరుకుని ఆందోళనలు చేస్తున్నారు.

## బీఆర్ఎస్ నేతల అరెస్టును ఖండించిన హరీష్ రావు



**హైదరాబాద్ పెన్ పవర్:**నల్లగొండ జిల్లాల్లో బిఆర్ఎస్ నాయకులను అరెస్టులు చేయడం పట్ల మాజీ మంత్రి హరీష్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసారు. రామన్నపేటలో నిర్మించ తలపెట్టిన అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీపై నిర్వహిస్తున్న ప్రజాభిప్రాయ సేకరణకు బీఆర్ఎస్ నేతలు వెళ్లకుండా అడ్డుకోవడం దుర్మార్గం. నల్గొండ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు, దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ నాయక్, మాజీ ఎమ్మెల్యేలు భూపాల్ రెడ్డి, చిరుమర్తి లింగయ్య, గాదరి కిషోర్ సహా ఇతర నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులను అరెస్టులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు.

స్వేచ్ఛగా జరగాల్సిన ప్రజాభిప్రాయసేకరణ, ఇంతటి నిర్బంధాల మధ్య చేయడం అప్రజాస్వామికం. ప్రజాపాలన అంటూ నిర్బంధాల పాలన కొనసాగించడం సిగ్గుచేటు. అక్రమంగా అరెస్టులు చేసిన బీఆర్ఎస్ నాయకులను, ప్రజా సంఘాల నేతలను, పర్యావరణవేత్తలను తక్షణం విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని అన్నారు

## అనుమతులు లేని ఐదు బహుళ అంతస్థుల బిల్డింగ్ లు సీజ్

**హైదరాబాద్ పెన్ పవర్:** ఎల్బీనగర్ నియోజకవర్గంలోని బీఎన్ రెడ్డి నగర్ డివిజన్ సాగర్ హోసింగ్ కాంప్లెక్స్, సిరి పూరి కాలనీ, బీఎన్ రెడ్డి కాలనీలో ఎటువంటి అనుమతులు లేకుండా నిర్మించిన బహుళ అంతస్థుల ఐదు బిల్డింగ్ లను జిహెచ్ఎంసి అధికారులు బుధవారం సీజ్ చేసారు. ముందు జాగ్రత్తగా భారీ పోలీసు బందోబస్తు నడుమ బిల్డింగ్ లను సీజ్ చేసారు.

# కేబీఆర్ పార్క్ వద్ద కొత్త రూల్.. పార్కింగ్ నిబంధనలు పాటించకపోతే ఫైన్



**హైదరాబాద్ పెన్ పవర్:**హైదరాబాద్ సిటీలో ప్రముఖ నేషనల్ పార్క్..కేబీఆర్ పార్క్ వద్ద ట్రాఫిక్ పోలీసులు కొత్త రూల్స్ పెట్టారు. ఇకపై పార్కుకు వాకింగ్ కు వచ్చేవారు తమ వాహనాలను ఇ ష్టారాజ్యంగా పార్కింగ్ చేయకూడదని హెచ్చరించారు.
ఉదయం, సాయంత్రం వేళ్లలో కె.బి.ఆర్ పార్కు కు వచ్చే వాకర్లు, సందర్శకులు రోడ్లపై వాహనాలను నిర్దేశించిన సమయాల్లో మాత్రమే పార్కింగ్ చేయాలని చెప్పారు. నిబంధనలు అతిక్రమిస్తే జరిమానాలు విధించడం తప్పవన్నారు పంజాగుట్ట ట్రాఫిక్ ఏసిపి కట్ట హరి ప్రసాద్. బుధవారం( అక్టోబర్ 23) బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసులతో కలిసి కేబీఆర్ పార్క్ వద్ద ట్రాఫిక్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా కొంతమంది వాకర్లు ఫ్రీ లెఫ్ట్ లో వాహనాలు నిలుపుతూ వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్త్తున్నరని చెప్పారు.
ఫ్రీ లెఫ్ట్ లో వాహనాలు నిలపవద్దని, రోడ్ల పక్కన కూడా ఉదయం సాయంత్రం వేళల్లో నిర్దేశించిన సమయంలో మాత్రమే వాహనాలు నిలపాలని సూచించారు. అడ్డగోలుగా వాహనాలు పార్కింగ్ చేసి వెళ్లడం వల్ల రోడ్లపై పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోతున్నాయని వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని ఈ విషయాన్ని వాకర్లు సందర్శకులు గమనించాలని కోరారు.

# కూల్చివేతలపై కేఏ పాల్ పిటిషన్... హైడ్రాకు హైకోర్టు కీలక ఆదేశాలు

- **నోటీసులు ఇవ్వకుండానే కూల్చివేస్తున్నారని కేఏ పాల్ పిటిషన్**
- **నోటీసులు ఇవ్వకుండా కూల్చివేతలు చేపట్టవద్దని హైడ్రాకు ఆదేశం**
- **పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి, హైడ్రాకు ఆదేశాలు**




**హైదరాబాద్ పెన్ పవర్:**ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ అంటూ ఎలాంటి నోటీ సులు ఇవ్వకుండానే హైడ్రా నగరంలో కూల్చివే తలు చేపడుతోందం టూ, ఈ కూల్చివేతలను ఆపేలా ఆదేశాలు ఇవ్వాలంటూ ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ వేసిన పిటిషన్‌పై హైకోర్టు విచారణ జరిపింది. నోటీసులు ఇవ్వకుండా కూల్చివేతలు చేపట్టవద్దని హైడ్రాకు న్యాయ స్థానం ఆదేశాలు జారీ చేసింది. ప్రత్యామ్నాయం చూసుకునే వరకు బాధితులకు సమయం ఇవ్వాలని తేల్చి చెప్పింది.పార్టీ ఇన్ పర్సన్‌గా కేఏ పాల్ స్వయంగా వాదనలు వినిపించారు. మూసీ బాధితులకు ఇళ్లు కట్టించిన తర్వాతే కూల్చివేతలు చేపట్టాలని హైడ్రాను హైకోర్టు ఆదేశించింది. అయితే, మూసీ బాధితులకు ఇళ్ళు కేటాయించిన తర్వాతే కూల్చివేతలు చేపడుతున్నట్లు అడిషనల్ అడ్వోకేట్ జనరల్ కోర్టుకు తెలిపారు. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి, హైడ్రాకు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.

## జీవన్ రెడ్డితో మాట్లాడుతా...ఆయన గౌరవానికి భంగం కలిగించం: శ్రీధర్ బాబు

**హైదరాబాద్ పెన్ పవర్:**జగిత్యాలలో కాంగ్రెస్ నేత గంగారెడ్డి మర్డర్ పై సీరియస్ గా ఉన్నామని మంత్రి శ్రీధర్ రెడ్డి అన్నారు. ఎమ్మెల్సీ జీవన్ రెడ్డిలాంటి సీనియర్ వ్యక్తిని కోల్పోవడానికి తాము సిద్ధంగా లేమన్నారు. హైకమాండ్ ఆదేశాలతో చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఇప్పటికే ఆయనతో మాట్లాడారని తెలిపారు. గాంధీభవన్ లో శ్రీధర్ బాబు మీడియాతో మాట్లాడుతూ 'నేను కూడా జీవన్ రెడ్డితోమాట్లాడుతాను. ఇప్పటికే జగిత్యాల ఘటనకు సంబంధించిన వివరాలన్నీ పార్టీకి చేరాయి. జరిగిన ఘటనపై సమగ్రవిచారణ జరిపిస్తం. దాడి వెనుక ఎవరు ఉన్నా వదిలిపెట్టం. జిల్లా ఎస్పీతో ఇప్పటికే మాట్లాడాం. నిందితులను కఠినంగా శిక్షిస్తం. ఎట్టి పరిస్థితుల్లో పార్టీలో జీవన్ రెడ్డి గౌరవానికి భంగం కలిగించం. ఆయన సేవలను మేం వినియోగించుకుంటాం. చనిపోయిన బాధిత కుటుంబానికి పార్టీ అండగా ఉంటుంది ' అని శ్రీధర్ బాబు తెలిపారు.



## బాలికతో అసభ్య ప్రవర్తన.. పోక్సో కేసు నమోదు

**హైదరాబాద్ పెన్ పవర్:** దుండిగల్ పి.యస్ పరిధి బౌరంపేటలో దారుణం జరిగింది. ఈ నెల 18 వ తేదీన నాలుగు సంవత్సరాల బాలిక తో ఓ వ్యక్తి అసభ్యంగా ప్రవర్తించాడు. పోలీసులు నిందితుని పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించిన విషయం తెలుసుకొని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే వివేకానంద మేడ్చల్ డి.సి.పి ని కలిసి నిందితుడికి త్వరగా శిక్ష పడేలా చూడాలని భాదిత కుటుంబానికి న్యాయం చేయాలని కొరారు.

## టీఎన్జీవోస్ కాలనీలో కూల్చివేతలు

**హైదరాబాద్ పెన్ పవర్:** మైలార్ దేవుపల్లి పోలీస్ స్టేషన్ పరిధి టీఎన్జీవోస్ కాలనీలో రెవెన్యూ అధికారులు కూల్చివేతలు ప్రారంభించారు. సర్వే నంబరు 156/1 లోని ప్రభుత్వం స్థలంలో అక్రమంగా నిర్మాణాలు జరిగినట్లు గుర్తించారు. ఆపై ఇతరులకు విక్రయించి , లక్షలు ఆర్జించినట్లు నిర్ధారించారు. ఎలాంటి పత్రాలు , అనుమతులు చూపించకపోవడంతో కూల్చివేసారు. బాధితులు జేసీబీని అడ్డుకున్నారు. లక్షల రూపాయలు పెట్టి స్థలాన్ని కొన్నామని బాధితుల ఆవేదన. తమకి న్యాయం చేయాలని వేడుకున్నారు. బాధితులకు , రెవెన్యూ సిబ్బందికి వాగ్వివాదం జరిగింది. జేసీబీ అద్దాలు ధ్వంసం చేయడంతో అక్కడ పరిస్థితి ఉద్రిక్తంగా మారింది

## ముత్యాలమ్మ ఆలయపనులను పర్యవేక్షించిన ముఖ్య కార్యదర్శి

**హైదరాబాద్ పెన్ పవర్:** సికింద్రాబాద్.. ముత్యాలమ్మ దేవాలయ పునరుద్ధరణ పనులను యుద్ధ ప్రాతిపదికన చేస్తున్నట్లు దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యార్ స్పష్టం చేశారు. బుధవారం జు కుమ్మరి గూడ ముత్యాలమ్మ ఆలయాన్ని శైలజ సందర్శించి మరమ్మత్తు పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దాదాపు 30 లక్షల ఖర్చుతో ఆలయ పునరుద్ధరణ పనులను చేస్తున్నట్లు పేర్కొన్నారు. బస్తీ వాస్తుల సహకారంతో సమాలోచనలు చేస్తూ ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. పంచలోహంతో కూడిన విగ్రహంతో పాటు ఆలయంలో ఫ్లోరింగ్, ద్వారాలు, ఆలయానికి రంగులు వేస్టున్నట్లు. మంచి ముహూర్తంలో విగ్రహపున ప్రతిష్ట, చండీయాగంతో పాటు హోమాధి కార్యక్రమాలను నిర్వహించాలని యోచిస్తున్నట్లు వెల్లడించారు.

## తల్లి.. చెల్లిపై జగన్ పిటిషన్

**హైదరాబాద్ పెన్ పవర్:** వైఎస్ కుటుంబం ఆస్తుల వివాదం నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్‌కు చేరింది. ఎన్‌సీ ఎల్‌టీ లో సెప్టెంబర్ 9న తన సోదరి షర్మిల, తల్లి విజయమ్మపై జగన్, భారతి పిటిషన్ వేశారు. సరస్వతి కంపెనీ షేర్ల వివాదాన్ని పరిష్కరించాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. కంపెనీలో 51శాతం షేర్లు తన పేరు మీద ఉన్నట్లు డిక్లేర్ చేయాలని కోరారు. నవంబర్ 8న జగన్ పిటిషన్‌పై విచారణ జరగనుంది.

## ఆదిలాబాద్‌లో పెద్దపులి.. భయాందోళనలో ప్రజలు

**హైదరాబాద్ పెన్ పవర్:**ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం వజ్జర్ అటవీ ప్రాంతంలో పెద్దపులి సంచారం కలకలం సృష్టిస్తోంది. ఆ గ్రామం వైపు వెళ్తు న్న గ్రామస్తులు పెద్దపులిని చూడడంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.వజ్జర్ అటవీ ప్రాంతంలో పెద్దపులి సంచరిస్తున్నట్టు సోషల్ మీడియాలో ఫోటోలు వీడియోలు వైరల్ గా మారాయి. దీంతో ఫారెస్ట్ అధికారులు గ్రామ ప్రజలకు అటువైపు వెళ్ళొద్దని సూచనలు చేస్తున్నారు.

# ఆఫీసులో ఎక్కువ టైమ్ లంచ్ బ్రేక్ తీసుకుందని చంపేశాడు!



**హైదరాబాద్ పెన్ పవర్:**ఇటీవల కాలంలో అమెరికాలో ఏ సమస్యకైనా తుపాకీతో సమాధానం చెప్పడమే పరిష్కారం అన్నట్లుగా ఆలోచనలు మారిపోతున్నట్లున్నాయనే చర్చ నడుస్తోంది. కారణం ఏదైనా కాల్పులు కామన్ అయిపోయిన పరిస్థితి ఇప్పుడు అగ్రరాజ్యంలో నెలకొంది. తాజాగా లంచ్ బ్రేక్ టైమ్ ఎక్కువగా తీసుకుందని సహోద్యోగిని కాల్చి చంపేశాడో వ్యక్తి!అవును... ఒక మహిళా సహోద్యోగిపై ఉత్తర టెక్సాస్ లో ఓ వ్యక్తి కాల్చి చంపాడు! ఎక్కువ సమయం లంచ్ బ్రేక్ తీసుకుందనేదే ఈ కాల్పులకు కారణం అని అంటున్నారు. ఆమె ప్రవర్తనపై ఆగ్రహం చెందిన అతడు.. ఆమె క్యూబికల్ వద్దే ఆమెపై కాల్పులు జరిపాడని అంటున్నారు. దీంతో.. ఆమె మృతి చెందింది!

అక్టోబర్ 17న ట్రావిస్ మోరిల్ (51) లూయిస్ విల్లేలోని అలెజియన్స్ ట్రక్కింగ్ లో పనిచేస్తోన్న తమ్వారా కొల్లాజో అనే మహిళపై కాల్పులు జరిపాడు. దీంతో.. పోలీసులు అతడిని అరెస్ట్ చేశారు. కొల్లాజో లంచ్ బ్రేక్ నుంచి తిరిగి వచ్చిన తర్వాత మోరిల్ ఆమెపై కాల్పులు జరిపినట్లు పోలీసులు తెలిపారు!ఈ సమయంలో ఆమెపై ఐదు రౌండ్లు కాల్పులు జరిపినట్లు చెబుతున్నారు. దీంతో ఆమెను హుటాహుటిన ఆస్పత్రికి తరలించగా.. ఆమె మరణించింది. పోలీసులు చెబుతున్న వివరాల ప్రకారం... ఈ నేరాన్ని మోరిల్ అంగీకరించాడు. అనదికారిక లాంగ్ బ్రేక్స్ తీసుకోవడం వల్లే ఆగ్రహంతో ఆమెపై కాల్పులు జరిపినట్లు తెలిపాడు!

ఈ సందర్భంగా స్పందించిన అలీయన్స్ ట్రక్కింగ్ సంస్థ.. ఈ ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. బాధితురాలి కుటుంబానికి కంపెనీ, కొలీగ్స్ సహాయంగా ఉంటామని తెలిపింది. లూయిస్ విల్లే ఆఫీసును నిరవధికంగా మూసివేసినట్లు వెల్లడించింది. మరోపక్క మోరిల్ %వి%1,00,00,000 బాండ్ పై డెంటన్ కౌంటీ జైలులో ఉంచబడ్డాడు!

# దానా తుపాను ఎఫెక్ట్.. ఏపీలో రెండ్రోజులు భారీవర్షాలు

**హైదరాబాద్ పెన్ పవర్:**దానా తుఫాను ఎఫెక్ట్ కారణంగా ఏపీలో రెండ్రోజులు భారీవర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. తూర్పు మధ్య బంగాళాఖాతంలో దానా కేంద్రీకృతమై ఉందని.. ఎల్లుండి( అక్టోబర్ 25)న పూరీ సాగర్ ద్వీపం మధ్య ఒడిశా సమీపంలో తీవ్ర తుఫానుగా తీరంగా దాటే అవకాశం ఉందని హెచ్చరించింది. దానా తుఫాను గంటలకు 12 కిలోమీటర్ల వేగంతో కదులుతుందని వెల్లడించింది. పారాదీప్ కు 460 కిమీ , ధమ్రాకు 490 కి.మీ , సాగర్ ద్వీపానికి 540 కిమీ దూరంలో తుఫాను కేంద్రీకృతమై ఉందని ఐఎండీ తెలిపింది. దనా తుఫాను కారణంగా రేపు గురువారం అక్టోబర్ 24) న ఏపీలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాల్లో తీరం వెంబడి గంటకు 80 నుంచి 100 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశంఉందని హెచ్చరించింది.

**రెండ్రోజులు ఏపీలోని ఈ జిల్లాల్లో వర్షాలు**

శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరి, విశాఖ, అన్నమయ్య,చిత్తూరు,తిరుపతి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. గంటకు 80-100కిమీ వేగంతో వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. బలమైన ఈదురుగాలుల ప్రభావం నుంచి ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

# గులాబీ పార్టీలో కీలక పోస్టు ఖాళీ.. వారి సమస్యలపై గళమెత్తేది ఎవరు..?




**హైదరాబాద్ పెన్ పవర్:**పదేళ్ల పాటు తెలంగాణలో తిరుగులేని పార్టీగా కొనసాగిన బీఆర్ఎస్ పార్టీకి.. ఇప్పుడు అధ్యక్షుల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి వచ్చింది. లక్షలాది జనంతో నిండిపోయిన పార్టీలో.. ఎవరికి ఏ పదవి ఇవ్వాలో తెలియక సతమతం అయిన సందర్భాలు ఉన్నాయి. కానీ.. ఇప్పుడు కీలక పోస్టుకు ఓ నేత దొరక్కపోవడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. పదేళ్లలోనే పార్టీలో ఈ పరిస్థితి రావడంపై కేడర్‌లోనూ ఆందోళన కనిపిస్తోంది.బీఆర్ఎస్ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలి పోస్టు ప్రస్తుతం ఖాళీ అయింది. పార్టీకి 60 లక్షల మహిళల సభ్యత్వాలు ఉన్నాయని ఆ పార్టీ నేతలు గొప్పగా చెబుతున్నప్పటికీ.. వారిలో ఓ సమర్థురాలైన అధ్యక్షురాలు లేకుండా పోయారా అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ప్రధాన ప్రతిపక్షంగా ఉన్నప్పటికీ బీఆర్ఎస్ తరఫున మహిళల గళం వినిపించే వారు కరువయ్యారు. ఇంత సీనియర్ పార్టీ అయినప్పటికీ మహిళా విభాగాన్ని ఎందుకు బలోపేతం చేయడం లేదన్న అనుమానాలూ కేడర్‌లో కలుగుతున్నాయి.

రాష్ట్రంలో కాంగ్రెస్ పగ్గాలు చేపట్టి పది నెలలు అవుతోంది. ఈ పది నెలల కాలంలో రాష్ట్రంలో మహిళలపై 1,900 లైంగికదాడులు జరిగాయని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. కానీ.. ఇంతవరకు మహిళల పక్షాన వాయిస్ వినిపించేందుకు మహిళా అధ్యక్షురాలు లేకుండాపోయారు. గతంలో మహిళా అధ్యక్షురాలిగా పనిచేసిన గుండు సుధారాణి గతేడాది పార్టీకి, అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. దాంతో అప్పటి నుంచి ఆ పదవి ఖాళీ గానే ఉంది. ఇప్పటివరకు ఆ పోస్టు భర్తీపై అధిష్టానం పెద్దలు దృష్టి సారించడం లేదు.కాంగ్రెస్ హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీల్లోనూ ప్రధానంగా ఒకటి మహాలక్ష్మి స్కీమ్ ఉంది. ఈ పథకం ద్వారా ప్రతీ మహిళకు నెలకు రూ.2,500 ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ప్రకటించింది. కానీ.. పది నెలలైనా ఇంకా ఆ పథకం అమల్లోకి రాలేదు. దీనికితోడు మహిళలపై దాడులు పెరుగుతున్నాయని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. అసలు నాయకురాలు

లేకపోవడంతో అటు లైంగిక దాడులపై, ఇటు మహాలక్ష్మి పథకంపై ప్రశ్నించే వారు కరువయ్యారని పార్టీలోనే గుసగుసలు వినిపిస్తున్నాయి. మహిళల సమస్యలపైనా మాట్లాడే వారు కరువయ్యారు. ఐదు నెలలుగా అధ్యక్ష పోస్టు ఖాళీ ఉన్నప్పటికీ పార్టీ నేతలు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు. వీలైనంత తొరగా కమిటీని వేయాలని కోరుతున్నారు. ఇప్పటికైనా గులాబీ అధినేత ఈ విషయంలో ఏదైనా చర్యలు తీసుకుంటారో చూడాలి.

# కాంగ్రెస్‌లో పాత, కొత్త.. ఈ వేడి చల్లారేదెన్నడో..?




**హైదరాబాద్ పెన్ పవర్:** గ్రూపులకు కేరాఫ్ కాంగ్రెస్ అనే విషయం అందరికీ తెలిసిందే. దశాబ్దాలు గడుస్తున్నా కాంగ్రెస్‌లో ఆ సంస్కృతికి మాత్రం తెరపడడం లేదు. అదే సంప్రదాయం ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. ఆ గ్రూపుల వివాదం ఇంకా నడుస్తూనే ఉంది. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీలో కొత్త, పాత అన్న వివాదం నడుస్తోంది. ఈ వివాదం ఎప్పటి నుంచో నడుస్తున్నప్పటికీ రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరినప్పటి నుంచి ఇంకా పెద్దదైంది. కొత్త వారిని తీసుకొచ్చి అందలం ఎక్కిస్తున్నారంటూ సీనియర్లు చాలా సార్లు అధిష్టానం వద్ద అసంతృప్తి వెల్లగక్కారు. సీనియర్లను కాదని జూనియర్లకు ఎలా ప్రాధాన్యం ఇస్తారంటూ చాలా సందర్భాల్లో నిలదీశారు. ఇక అప్పటి నుంచి ఆ వివాదం నడుస్తూనే ఉంది.అయితే.. దశాబ్ద కాలం తరువాత రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటికీ ఇంకా ఆ వివాదాలు సమసిపోలేదు. ఈ వివాదాలు ఒక రాష్ట్ర నేతల మధ్యనే అనుకుంటే పొరపాటే. జిల్లా, మండల స్థాయిల్లోనూ కనిపిస్తున్నాయి. సీనియర్లు, జూనియర్లు అంటూ నిత్యం దెబ్బలాడుకోవడం చూస్తూనే ఉన్నాం. తాజాగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు వాటిని మరోసారి రుజువు చేశాయి. ఓ సీనియర్ నేత అయి ఉండి.. 'మీకో దండం.. మీ పార్టీకో దండం' అంటూ వ్యాఖ్యలు చేయడం పార్టీలో ఒక్కసారిగా కలకలం రేపింది. ఇలాంటి కక్ష సాధింపు రాజకీయాలు తనకు వద్దని.. పార్టీ నుంచి తప్పుకొని ఏదైనా స్వచ్ఛంద సంస్థ నడుపుకుంటానని జీవన్ మాట్లాడారు. ఇటీవల జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌ను జీవన్ రెడ్డికి సంబంధం లేకుండానే కాంగ్రెస్ పార్టీలో చేర్చుకున్నారు. ఓ ఎమ్మెల్యేను అందులోనూ తన ప్రాతినిధ్య జిల్లా ఎమ్మెల్యేను చేర్చుకుంటుంటే తనకు కనీసం సమాచారం ఇవ్వలేదని బాధపడ్డారు. గత కొన్ని రోజులుగా పార్టీలో అవమానాలు ఎదురవుతూనే ఉన్నాయని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ పార్టీలో ఈ ఒక్క ఘటనే కాదు.. కొన్ని రోజులుగా వరుసగా ఈ గ్రూప్ వార్‌లు కనిపిస్తూనే ఉన్నాయి. ఇటీవల మంత్రి కొండా సురేఖపై ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన కాంగ్రెస్ పార్టీ నేతలు భగ్గుమన్నారు. కొండా ఫ్యామిలీ అన్ని నియోజకవర్గాలపై పైచేయి సాధించేందుకు ప్రయత్నిస్తోందంటూ నేతలంతా ఐక్యతారాగం వినిపించారు. ఇదే విషయాన్ని పీసీసీ, ఏఐసీసీ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో పీసీసీ చీఫ్ హోదాలో మహేశ్ కుమార్ గౌడ్ వారందరినీ బుజ్జగించాల్సి వచ్చింది.

అంతకుముందు బాన్సువాడలో పార్టీ కార్యక్రమాల్లో ప్రోటోకాల్ అంశంపై గొడవ జరిగింది. అక్కడ పోచారం శ్రీనివాసరెడ్డి వర్సెస్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఏనుగు రవీందర్ రెడ్డి మధ్య వివాదం నెలకొంది. సీనియర్ నేతగా శ్రీనివాసరెడ్డికి ప్రాధాన్యం ఇవ్వాలని పీసీసీ చీఫ్ స్వయంగా రవీందర్ రెడ్డిని ఆదేశించారు. కానీ.. ఆయన మాత్రం వాటిని పట్టించుకోలేదు. తానే ఇన్చార్జిని అని.. అన్నింటా తనకే ప్రాధాన్యం ఇవ్వాలంటూ ప్రకటించేసుకున్నారు. ఇక పార్టీ ప్రధాన కార్యాలయమైన గాంధీభవన్ వేదికగా మేయర్ విజయలక్ష్మి, కార్పొరేటర్ విజయారెడ్డి దుర్భాషలాడుకున్నారు. ఇలా ప్రతీ జిల్లాలోనూ గ్రూపుల మధ్య వార్ నడుస్తూనే ఉంది. సీనియర్లు, జూనియర్లు అన్న భేదాభిప్రాయాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇక ఈ జాతీయ పార్టీలో ఈ గ్రూపు విభేదాలకు ఫుల్ స్టాప్ పడదని ఆ పార్టీలోనే గుసగుసలు వినిపిస్తున్నాయి.